తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





## ఇంట్లో దూరి: వృద్ధులను భయపెట్టి . . చోరి



శ్రీకాళహస్తి, జనవరి 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలోనూ, పరిసరాల్లో ఇళ్ళలో ఎవ్వరూ లేని సమయంలో దొంగలు దోచుకుంటున్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇద్దరు వృద్దులునివాసముంటున్నారు. సోమవారం రాత్రి వారు నిద్రించిన సమయంలో నలుగురు వ్యక్తులు జొరబడి వృద్దులను భయపెట్టి, భయభ్రాంతుల్ని చేసి బీరువా తాళాలు పగుల గొట్టి చోరీకి పాల్పడినట్లు వన్‌టౌన్ సిఐ డి.గోపి తెలిపారు. ఇంట్లోలేని సమయంలో గుర్తించి చోరీకి పాల్పడ్డారు. వృద్దులను భయపెట్టి బీరువా బీగాలు తీసుకొని పగుల గొట్టి విలువైన పట్టు చీరలతో పాటు బీరువా లో దాచిన రూ.20వేల నగదుతో పాటు 72 గ్రాముల బంగారు ఆభరణాలను తీసుకెళ్ళినట్లు సమాచారం. పోలీసులు రంగ ప్రవేశం చేసి విచారణ జరుపుతున్నారు. అయితే ఈ చోరి ఓ పథకం ప్రకారమే జరిగినట్లు సిఐ డి.గోపి భావిస్తున్నారు.

## ఎర్రచందనంపై నిఘా పటిష్టం

### ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్



తిరుపతి కార్పొరేషన్, జనవరి 7, ప్రభాతవార్త

ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక చర్యల్లో భాగంగా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు సూచనల మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ అటవీ శాఖ అధికారులతో ప్రత్యేక సంయుక్త సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పెంచల కోన, సోమశిల, లంకమల అటవీ ప్రాంతాలలో పర్యటించారు. పెంచలకోన, బద్వేలు, సిద్దవటం, రైల్వే కోడూరులలో ఈ సమావేశాలను సోమ, మంగళవారాల్లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లర్లు అక్రమ రవాణాకు ఉపయోగించే ఎంట్రీ, ఎగ్జిట్, లోడింగ్ పాయిం ట్లు వద్ద నిఘా పటిష్టం చేయాలని సూచించారు. పాత నేరస్తులపై సాంకేతిక వ్యవస్థ తో నిఘా ఉంచి, నేరాలకు మళ్లీ పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. డీఎస్పీలు జి. బాలిరెడ్డి, వీ. శ్రీనివాసులురెడ్డి, ఏసీఎఫ్ జె. శ్రీనివాస్, ఇతర టాస్క్ ఫోర్స్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# హెల్తీ..వెల్తీ..హ్యాపీ.. సమాజం కోసం కృషి

### పిల్లల భవిష్యత్తు కోసం పనిచేస్తున్నా.. కుప్పాన్ని దేశంలోనే ఆదర్శం చేస్తా !! : సిఎం చంద్రబాబు



సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న సిఎం చంద్రబాబు



కుప్పం, జనవరి 7 ప్రభాతవార్త

రాష్ట్రంలో హెల్తీ, వెల్తీ, హ్యాపీగా ఉండే సమాజం కోసం తాను కృషి చేస్తున్నట్లు సిఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. రెండు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా మంగళవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రస ంగించారు. తాను పిల్లల భవిష్యత్తు కోసం పనిచేస్తున్నానని పేర్కొన్నారు. తనను ఎనిమిదిసార్లు గెలిపించిన కుప్పం ప్రజల రుణం తీర్చుకునేలా కుప్పాన్ని దేశంలోనే ఆదర్శనియోజకవర్గంగా మార్చుతానని ప్రకటించారు. కుప్పం అభివృద్ధికి విజన్ 2029కు శ్రీకారం చుట్టామన్నారు. కుప్పంలో యువతకు ఉపాధి అవకాశాలు, పరిశ్రమల స్థాపనతో పాటు భవిష్యత్తులో ప్రపంచస్థాయి విద్య అందించే కేంద్రంగా మార్చుతామన్నారు. కుప్పం మున్సిపాలిటీలో 92కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గంలో 110 కోట్లతో అన్ని గ్రామాల్లో డ్రైనేజీల నిర్మాణానికి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కుప్పంలో అర్హులందరికీ పక్కా ఇళ్లను అపార్ట్‌మెంట్‌లు నిర్మించి అందిస్తామన్నారు. టాటా సంస్థ సహకారంతో చిత్తూరు జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులను అనుసంధానం చేస్తామన్నారు. ఈ విషయంగా ఇదివరకే టాటా సంస్థ ఎం.డి. చంద్రశేఖర్‌తో చర్చించినట్లు పేర్కొన్నారు. ఈసంస్థ కోలారు జిల్లాలో టెక్నాలజీ సాయంతో ప్రాజెక్ట్ చేపట్టి విజయవంతమైందన్నారు. తొలుత కుప్పం నియోజకవర్గంలో ఈ తరహా ప్రాజెక్టును పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి అనంతరం చిత్తూరు జిల్లా ఆపై రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని వెల్లడించారు. ఆస్పత్రుల అనుసంధానంతో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా మలిచేందుకు చర్యలు**

కుప్పం నియోజకవర్గంలో ఔత్సాహికులైన మహిళల్ని పారిశ్రామికవేత్తగా మలిచేందుకు చర్యలు చేపట్టినట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన అలిప్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని వారికి 14 ఎకరాల భూములు కేటాయించామన్నారు. అలిప్ సంస్థ ఆ ప్రాంతంలో మహిళాశక్తి భవన్ నిర్మించడంతో పాటు గ్రీన్ ఎనర్జీ పార్కును సైతం ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కేంద్రంలో 1200మంది మహిళలకు తొలివిడతగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే నియోజకవర్గంలో బిగ్ బాస్కెట్ సంస్థ ద్వారా కూరగాయలు, పళ్ల విక్రయాలకు నాలుగు కేంద్రాలు ఏర్పాటుచేయిస్తున్నట్లు తెలిపారు. జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్ కింద ఐఐటి కాన్పూర్ బృందంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. అలాగే కేర్ అండ్‌గ్రో స ంస్థ ద్వారా చిన్న పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలపై ఒప్పందం జరిగిందన్నారు. కుప్పం లో ఎయిర్‌పోర్ట్‌ను సైతం అందుబాటులో తెచ్చి ఇక్కడే విమానాల మరమ్మత్తుల కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**22 కోట్లతో ఆలయాల అభివృద్ధి :**

కుప్పం నియోజకవర్గంలో ఉన్న నాలుగు ప్రముఖ ఆలయాలను 2 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంకు 8.70కోట్లు, శ్రీ బేటరాయ స్వామి ఆలయంకు 2.66 కోట్లు, గుడుపల్లె మల్లప్పకొండకు 3.80కోట్లు, రాళ్లబూదుగూరు శ్రీ కోదండరామాలయంకు 7.80 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

**మహిళా సంఘాలకు 457కోట్ల చెక్కు పంపిణీ :**

డిఆర్‌డిఎ అధ్వర్యంలో 41342 మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజ్, శ్రీనిధి పథకం కింద 457.57కోట్ల చెక్కును సిఎం చంద్రబాబునాయుడు పంపిణీ చేశారు. అలాగే 71మందికి 1.93కోట్ల సిఎంఆర్ఎఫ్ చెక్కులు, 4కోట్లతో 220మంది రైతులకు డ్రిప్ పరికరాలు, 2.13కోట్లతో ఐదుమంది రైతులకు మినీ ట్రాక్టర్లు పంపిణీ చేశారు. సమావేశంలో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబుచే జన నాయకుడు పోర్టల్ ఆవిష్కరణ



కుప్పం, జనవరి 7 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు మంగళవారం కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జన నాయకుడు పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కార్యాలయంలో ప్రజలనుంచి వినతుల స్వీకరణకోసం ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ సెల్ విభాగాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. వచ్చే వినతుల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)తో పాటు ముఖ్యమంత్రికి వచ్చే వినతులను నేరుగా సిఎంఒ కార్యాలయం నుంచి పర్యవేక్షించడంతో పాటు రోజువారీ ఆయా వినతుల స్థితిగతులపై సమీక్షిస్తామని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ రావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి.వికాస్ మర్మత్, జెసి విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ తదితరులు పాల్గొన్నారు.

### ప్రణాళికాబద్ధంగా

# ఫ్లెమింగో ఫెస్టివల్

### 18, 19, 20 తేదీల్లో పక్షుల పండుగ సందడి

### - సందర్శకులకు మంచి అనుభూతి కల్పిస్తాం - కలెక్టర్ వెంకటేశ్వర్



సూళ్లూరుపేట, దొరవారిసత్రం జనవరి 7 ప్రభాతవార్త

సూళ్లూరుపేట కేంద్రంగా పులికాట్, నేలపట్టు పక్షుల కేంద్రాల విశిష్టతను చాటుతూ 2001వ సంవత్సరం నుంచి నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను జనవరి 18, 19, 20 తేదీల్లో ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించినట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ వెల్లడించారు. మంగళవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి ఆయన దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు, సూళ్లూరుపేట మండలం అటకానితిప్ప, తడ మండలంలోని బివిపాలెంతో పాటు సూళ్లూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వేదిక కానున్న జూనియర్ కాలేజి క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2001 నుంచి రాష్ట్ర పండుగగా ఫ్లెమింగో ఫెస్టివల్‌ను 2020 వరకు కొనసాగించారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు టూరిజం, అటవీశాఖల సహకారంతో తిరిగి ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో కన్నా భిన్నంగా ఈ సారి పండుగను సందర్శించే వారికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నేలపట్టు, అటకానితిప్పలో పక్షుల వీక్షణ, బివిపాలెం రేవులో బోటు షికారు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలోని ఐఐటి మహిళా యూనివర్శిటీలోని పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లతో అధ్యయన తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు వేదికగా శ్రీసిటీలో రెండురోజులు పాటు అక్కడి వారి సహకారంతో పారిశ్రామికవేత్తలు తదితరులతో పండుగలో భాగంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముంబాయి నేచరల్ హిస్టరీ సొసైటీ వారిని కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పండుగలో భాగంగా పులికాట్, నేలపట్టు అభివృద్ధితో పాటు అక్కడ నివసించే వారి కోసం ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలనే అంశంపై కూడా మేధావుల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సాయంత్రం సూళ్లూరుపేటలోని జూనియర్ కాలేజి మైదానంలో ప్రముఖులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 18న జూనియర్ కాలేజి మైదానంలో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను లాంఛనంగా ముఖ్య అతిథులచే ప్రారంభించడం జరుగుతుందన్నారు. హెచ్‌ఎంపివి వైరస్ పండుగకు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బంది లేదని, దీనిపట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కరోనా సమయంలో తీసుకున్న జాగ్రత్తలనే తీసుకుంటే సరిపోతుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. అనంతరం స్థానిక ఎస్‌కెఎస్ కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని అధికారులు, ఇతర ప్రముఖులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి వారి నుంచి పండుగ నిర్వహణకు సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, మాధవనాయుడు, వైల్డ్ లైఫ్ డిఎఫ్ఓ రాధిక, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, ఆర్డీఓ కార్యాలయ ఏఓ కె.రవికుమార్, తహశీల్దార్ ఎస్‌వి నరసింహారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఫ్లెమింగో ఫెస్టివల్‌లో పులికాట్‌లో బోటు షికారు

### - బివిపాలెం వద్ద ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్



తడ, జనవరి 7 ప్రభాతవార్త

పులికాట్ సరస్సులో సందర్శకుల కోసం బోటు షికారు ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 18, 19, 20 తేదీలలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. మంగళవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఇతర అధికారులతో కలిసి తడ మండలం భీములవారిపాలెం పడవల రేవు వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. పండగ తేదీలో ఖరారు చేసిన అనంతరం వీరు పులికాట్ తీరానికి వచ్చారు. పడవలపై సందర్శకులు స్వేచ్ఛగా విహరించడానికి వారి భద్రత, ఇతర ఏర్పాట్లపై సమీక్షించారు. 35 బోట్లు ఏర్పాటు చేస్తామని, బోటులో ప్రయాణించే వారికి ఖచ్చితంగా లైఫ్ జాకెట్లు ఉండాలని కలెక్టర్ సూచించారు. సెక్యూరిటీ ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, ప్రతి బోటుకు ఇద్దరు గత ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పులికాట్ సరస్సులో ఆహారం కోసం వచ్చే పెలికాన్, ఫ్లెమింగో, ఇతర పక్షులు, ప్రకృతి కూడా పర్యాటకులకు కనువిందు చేస్తుంటాయని, ఈ పక్షుల పండగ రోజుల్లో ఎక్కువమంది సందర్శకులు ఈ అనుభవాలను ఆస్వాదించాలని ఎమ్మెల్యే విజయశ్రీ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, తహశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఓ విజయకుమార్, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి నారాయణరెడ్డి, వైల్డ్‌లైఫ్ డిఎఫ్ఓ రాధిక, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, ఫారెస్ట్ అధికారి రమణయ్య, మాజీ జడ్పిటిసి బొమ్మన్ శ్రీధర్, తడ మండలాధ్యక్షుడు కొళవి రఘు, ఉప మండలాధ్యక్షుడు సిహెచ్ రమేష్, వన్నియార్ల సంఘం నాయకులు కె.సెల్వం, రవి, జాలర్ల నేతలు సుధాకర్, ఏకాంబరం, ప్రకాష్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కలియుగవైకుంఠం ముస్తాబు

### -భక్తులను ఆకట్టుకునేలా విస్తృత ఏర్పాట్లు






తిరుమల, జనవరి 7ప్రభాతవార్తప్రతినిధి:

పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు విచ్చేసే భక్తులను మరింతగా ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేలా టిటిడి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమలను సర్వాంగసుందరంగా రకరకాల ఆధ్యాత్మిక ,భక్తిభావం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రతిమలు, పుష్పాలు, పచ్చని తోరణాలు, రకరకాల బొమ్మలు తిరుమలకు చేరాయి. ఆలయం ముందు, పరిసరాల్లో భారీ సెట్టింగ్‌లతో భక్తులకు కనువిందుచేయనున్నాయి. టిక్కెట్లు, టోకెన్ లేని భక్తులకు వైకుంఠద్వార నమూనాలు, ఇలవైకుంఠం తలపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మాఢవీధుల్లో జర్మన్‌షెడ్లు నిర్మించారు.

## పదిరోజులు వైకుంఠద్వారాలు తెరుస్తాం

### టికెట్, టోకెన్ ఉంటేనే దర్శనం

### నిర్దేశిత సమయానికే క్యూలైన్లలోకి అనుమతి -టిటిడి ఈఓ



తిరుమల, జనవరి 7ప్రభాతవార్తప్రతినిధి:

ధనుర్మాసం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజులు పాటు వైకుంఠద్వార దర్శనాలు తెరచి భక్తులకు దర్శనం కల్పిస్తామని టిటిడి ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. ఇందుకు ఇప్పటికే ఆన్‌లైన్‌లో జారీచేసిన టిక్కెట్లుతోబాటు ఆఫ్‌లైన్‌లో జారీచేయనున్న ఎస్ఎస్‌డి టోకెన్లు కలిగిఉన్న వారికి మాత్రమే వైకుంఠ దర్శనం చేయిస్తామన్నారు. పదిరోజులు 4.30లక్షల ఎస్ఎస్‌డి టోకెన్లు, 19,500 శ్రీవాణి టిక్కెట్లు, 1.40లక్షలు ఎస్ఇడి టిక్కెట్లు, 18,250 టిక్కెట్లు దాతల దర్శనాలు, రాజ్యాంగపరిధిలోని ప్రముఖులు, వారి కుటుంబసభ్యులు ఇలా రోజువారీగా 70వేలమంది భక్తులకు దర్శనాలు చేయించేలా ఏర్పాట్లు చేశామన్నారు. 10వతేదీ వైకుంఠ ఏకాదశి ఘడియలు రావడంతో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠమోక్షమార్గం ప్రవేశం కల్పిస్తామన్నారు. మంగళవారం మధ్యాహ్నం అన్నమయ్యభవనంలో టిటిడి అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఓ శ్రీధర్, డిప్యూటీ ఈఓలు పి.హరీంధ్రనాథ్, లోకనాథం, భాస్కర్, ఓఎస్‌డి సత్రానాయక్, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి ఈఓ శ్యామలరావు మీడియాకు వివరాలు వెల్లడించారు. గోవిందమాల ధరించిన భక్తులు కూడా తిరుపతిలో టోకెన్లు పొంది స్వామివారిని దర్శించుకోవాలని ఈఓ స్పష్టం చేశారు. భక్తులు క్యూలైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా భక్తులకు టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తామన్నారు. దర్శన టిక్కెట్లు, టోకెన్లు ఉన్నవారినే ఆలయంలోనికి అనుమతినిస్తామని, లేకుంటే ఆలయంలోనికి రాలేరని తెలిపారు. ఈ సమావేశంలో తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, సిఐ విజయకుమార్ పాల్గొన్నారు.

# చెరువును వ్యర్థాలతో నింపేస్తున్నారు

### - ఇప్పటికే పూడిపోయిన సప్లై ఛానల్



వ్యర్థాలు పడవేయడంతో పూడిపోతున్న బండివాని చెరువు

చిత్తూరు, జనవరి 7 ప్రభాతవార్త:

ఎక్కడైనా ఎప్పుడైనా కరవు సమయాల్లో నీటి నిల్వలను పెంచుకోవడానికి కొత్త చెరువులు త్రవించి భవిష్యత్తులో నీటి కష్టం తలెత్తకుండా జాగ్రత్త పడుతారు. అయితే యాదమరి మండలంలో ఓ కాంట్రాక్టర్ ఏకంగా వర్షాలకు ప్రతి ఏడాది పుష్కలంగా నీటి నిల్వ వుంటే ఓ పెద్ద చెరువును వ్యర్థ పదర్థాలతో పూడ్చేస్తున్నాడు. యాదమరి మండలం మీదుగా చైన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టారు. తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నై నుండి కర్నాటక రాష్ట్ర రాజధాని బెంగళూరు వరకు ప్రయాణ దూరం భారీగా తగ్గించి ప్రయాణీకులు తక్కువ సమయంలో గమ్యస్థానం చేరుకునేలా ఈ ఎక్స్‌ప్రెస్ హైవేను సిద్ధం చేస్తున్నారు. ఈ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం పూర్తిగా ఎత్తైన ప్రాంతాల్లో నిర్మిస్తుండటంతో ఈ రహదారికి అడ్డంగా వాగులు, వంకలు, చెరువులు, కొండలు, గుట్టలు వస్తుంటాయి. ఈ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం వాగులు, వంకలు, గుట్టలు, చెరువులు వున్న ప్రాంతం కంటే కొంత ఎత్తైన ప్రాంతంలో వెళ్తుండటంతో సంబంధిత కాంట్రాక్ట్ పనులు చేస్తున్న వ్యక్తులు ఈ రహదారి నిర్మాణ సమయంలో వస్తున్న చెరువులు, వంకలు, వాగులను పూడ్చి వేస్తున్నారు. యాదమరి మండలంలో పెరుమాళ్ళపల్లి గ్రామ సమీపంలో ఈ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ సంస్థ రోడ్డు నిర్మాణ పనులకు తారు, కంకర, జల్లి, డస్ట్ తదితరాలు సరఫరా చేయడానికి ఒక యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడి నుండి అనునిత్యం రోడ్డు నిర్మాణం జరుగుతున్న ప్రాంతాలకు జల్లి, కంకర, డస్ట్ తదితరాలను పెద్ద ఎత్తున ట్రిప్పర్లు మోసుకెళ్తువుంటాయి. ఈ యూనిట్‌లో వ్యర్థంగా మిగిలిపోయిన వ్యర్థాలు అధికం కావడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న కొంతమంది సిబ్బంది ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు వెళ్తున్న మార్గంలోని చెరువులు, కుంటలు, వాగుల్లో పడేయాలని ట్రిప్పర్ల డ్రైవర్లను ఆదేశించింది. ఈ మేరకు ఈ డ్రైవర్లు అనునిత్యం యూనిట్‌లోని వ్యర్థాలను తీసుకెళ్ళి సమీపాల్లోని చెరువుల్లో డంప్ చేస్తుండటంతో చెరువులు పూడిపోతున్నాయి. యాదమరి మండలం బండివాండ్లవూరు గ్రామ పరిధిలోని బండివానిచెరువు గత ఏడాది వర్షం కురవడంతో నీటితో కళకళలాడింది. ఈ ఏడాది వర్షాలు సరిగ్గా లేకపోవడంతో చెరువులో నీటి నిల్వ తగ్గింది. ఈ చెరువుపై నుండి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతుండటంతో చెరువు బాగా లోతుగా వుండటంతో యూనిట్‌లో మిగులుతున్న వ్యర్థాలను ఇక్కడ డంప్ చేయాలని యూనిట్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది సిద్ధం అయ్యారు. రాత్రికి రాత్రి ఈ చెరువులో యూనిట్‌లో వున్న వ్యర్థాలను తరలించి డంప్ చేయడం ప్రారంభించారు. ఇప్పటికే చెరువుకు వర్షాలు కురిస్తే నీటి సరఫరా చేసే ఒక సప్లై ఛానల్ పూడ్చివేశారు.

# సర్వాంగ సుందరంగా రాజగోపురం : ప్రత్యామ్నాయ రోడ్లకు సన్నాహాలు

### శివరాత్రికి సిద్ధం చేస్తున్న అధికారులు

### రూ. 2కోట్లతో మండపాలు,ఆలయాలు:18లక్షలతో రోడ్డు: ఇఓ టి.బాపిరెడ్డి



శ్రీకాళహస్తి, జనవరి 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని వచ్చేనెల 21న ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే జరుగుతున్న పనులను పూర్తి చేయుటకు పూర్తి అయిన ఆలయాలు, మండపాలకు కుంబాభిషేకం జరుపుటకు చర్యలు తీసుకున్నట్లు ఇఓ బాపిరెడ్డి వివరించారు. రూ.2కోట్లుతో చేపట్టిన మండపాలు, ఆలయాలకు కుంబాభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు. కాగా రాజగోపురం చుట్టూ సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నట్లు ఇఓ బాపిరెడ్డి వివరించారు.

**20న కుంబాభిషేకాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో పూర్తి అయిన మండపాలు, దేవాలయాల కుంబాభిషేకం ఈ నెల 20 నిర్వహించుటకు ఆలయ అర్చకులు సూచించారని ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం శైవ క్షేత్రంగా ప్రసిద్ది చెందిందన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన తరువాత అనుబంధ ఆలయాల నిర్మాణం వివిధ దశల్లో ఉండేదన్నారు. అయితే ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇఇ మురళీధర్‌రెడ్డి చొరవ చూపి కాంట్రాక్టర్లను చైతన్యవంతుల్ని చేసి పనులు పూర్తి చేయించారని వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగ పట్టణ నడిబొడ్డులో ఉన్న కుమార స్వామి తిప్పవద్ద దిగువ భాగాన వినాయక మండపం పురాతనమైనది కాబట్టి దానిని తొలగించి రూ.24లక్షలతో మండపం పునర్నిర్మాణం జరిగిందన్నారు. దానిని ఈ నెల 20 న కుంబాభిషేకం జరపనున్నట్లు వివరించారు. అలాగే సుమారు 10 సంవత్సరాల నుంచి నిర్మాణానికే పరిమితమైన రూ.1.25కోట్లు అంచనాల వాహనాల మండపంను పూర్తి చేయించారన్నారు. ఈనెల 20 న కుంబాభిషేకం నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు.

**రాజగోపురం చుట్టు ఆధునీకరణ:**

పట్టణ నడిబొడ్డులోని రాజగోపురం చుట్టూ పలు సంస్కరణలు చేపట్టామన్నారు. ఇరుకు రోడ్డుగా ఉన్నందువల్ల వాహనాల మండపం అలాన్‌మెంట్‌గా రోడ్డును వెడల్పు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ రాజగోపురానికి ఎదురుగా ప్రహరి గోడ ఫెన్సింగ్ వేస్తున్నట్లు వివరించారు. రూ.18లక్షలతో బిటి రోడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాగా ఉత్తరం వైపు ఉన్న గోడను తొలగించి దక్షిణం వైపు జరుపుతున్నట్లు వివరించారు.

